క్లుప్తంగా

ఏకగ్రీవంగా మత్స్యకార సంఘ ఎన్నిక



కోడూరు: పాలకాయతిప్ప మెరైన్ మత్స్యకార సహకార సంఘం ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం.రవికుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గ్రామస్తుడు చెన్ను నాగరాజును సంఘ అధ్యక్షుడిగా మత్స్యకారులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చిలకలపూడి ముసలయ్య, కార్యదర్శి చెన్ను నాగు పోతురాజును ఎన్నుకున్నారు. మత్స్యకారుల సంక్షేమానికి సంఘం పని చేస్తుందని నూతన అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు మత్స్యకారులు శాలువాలు కప్పి సత్కరించారు. ఉల్లిపాలెం వీఎఫ్‌ఏ కోలా నరేంద్రకుమార్, సాగరమిత్ర చిలకలపూడి మోషే, సిబ్బంది పాల్గొన్నారు.

14న ఉచిత వైద్య శిబిరం

మచిలీపట్నంటౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీ సోమవారం మచిలీపట్నంలో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని దళిత జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు(జానీ) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దళిత జేఏసీ, విజయవాడ హెల్ప్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్(లక్ష్మీ టాకీస్ సెంటర్)వద్ద ఉన్న ఎస్ కన్వెన్షన్ హాల్లో వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి వైద్య సేవలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

సాగుభూమి కౌలుకు బహిరంగ వేలం వాయిదా

మచిలీపట్నంటౌన్: గొడుగుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి వల్లమున్నాడులో ఉన్న సాగుభూముల కౌలుకు ఈ నెల 10వ తేదీ జరగాల్సిన బహిరంగ వేలం వాయిదా వేస్తున్నట్లు ఈఓ కేవీ గోపాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకూ గుడివాడ మండలం మోటూరులోని శ్రీ సీతారామ స్వామిదేవస్థానంలో జరిగిన శ్రీరామ నవమి కార్యక్రమ ప్రత్యేక విధులు నిర్వహించాలని దేవదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ తనను ఆదేశించడంతో ఆ విధులు చేస్తున్నామని వివరించారు. ఈ కారణంగా ఈ నెల 10వ తేదీ గురువారం నిర్వహించాల్సిన వేలం వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది తర్వాత తెలియజేస్తామని పేర్కొన్నారు.

తీరప్రాంతాలకు ట్యాంకర్లతో తాగునీరు

కోడూరు: వేసవి నేపథ్యంలో మండలంలోని తీరప్రాంత ప్రజలకు ఉచితంగా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచనల మేరకు రామకృష్ణాపురం, ఇరాలి, ఊటగుండం, హంసలదీవి, పాలకాయతిప్ప గ్రామాల ప్రజలకు పది రోజుల నుంచి తాగునీటిని అందిస్తున్నారు. మంగళవారం ఇరాలి, హంసలదీవి గ్రామాలకు 20వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంక్‌లో నీటిని సరఫరా చేశారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు




మచిలీపట్నంటౌన్: పరాసుపేటలోని శ్రీ సువర్చల సమేత ఆంజనేయస్వామి దేవస్థానంలో రెండవ మంగళవారం సందర్భంగా స్వామివారికి విశేషాలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామికి వడమాలలు వేశారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ తిక్కిశెట్టి వీర వెంకటమోహనరావు పర్యవేక్షించారు.

పెరటి మిద్దె తోటలతో ఆరోగ్యం, ఆదాయం

మోపిదేవి: పెరటి మిద్దె తోటల పెంపకంతో ఆరోగ్యం, ఆదాయం లభిస్తుందని కేవీకే ఘంటసాల సమన్వయకర్త డాక్టర్ సుధారాణి తెలిపారు. మోపిదేవి ప్రాథమిక పాఠశాలలో పోషణ పక్వాడ కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ విశ్రాంత ఉపాధ్యాయులు, గృహిణులు ఔత్సాహికులు ఇళ్ల పరిసరాల్లో పెరటి మిద్దె తోటలు పెంచితే పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు పొందవచ్చని తెలిపారు. ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకు పోషణ పక్వాడ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సస్యరక్షణ శాస్త్రవేత్తలు డాక్టర్ కె.రేవతి, డాక్టర్ ఎం వెంకటలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, మోపిదేవి, రావివారిపాలెం మహిళలు పాల్గొన్నారు.

కుండ.. చల్లగుండ

- పేదవాడి ఫ్రిజ్‌కు సీజనొచ్చింది
- కుండలో నీటిని తాగడానికి మొగ్గు చూపుతున్న ప్రజలు
- ఊపందుకున్న అమ్మకాలు



అమ్మకానికి సిద్ధంగా మట్టి కుండలు



చల్లపల్లి, మచిలీపట్నం రహదారిలో రామానగరం వద్ద మట్టి కుండలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

చల్లపల్లి: పేదోడి ఫ్రిజ్‌కు సీజనొచ్చింది. కుండలో నీరు తాగితే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఆధునిక ప్రపంచంలో మట్టి పాత్రల వినియోగం కనుమరుగవుతున్నా మంచి నీటి కుండలకు మాత్రం నానాటికీ డిమాండ్ పెరుగుతూనే ఉంది. వేసవిలో పేదల నుంచి ధనికుల వరకూ అందరూ కుండలోని నీటిని తాగడానికి మొగ్గు చూపుతుంటారు. తక్కువ ఖర్చు, సహజ సిద్ధమైన కూలింగ్, కుండలోని నీటిని తాగితే కలిగే గొప్ప అనుభూతి ఇవన్నీ ప్రజలను కుండలవైపు మరలేలా చేస్తున్నాయి.

పెరుగుతున్న వేసవి తాపం

రోజు రోజుకూ వేసవి తాపం పెరుగుతోంది. ఎండ వేడికి శరీరంలోని నీరు చెమట రూపంలో బయటకు పోతోంది. దీంతో వేసవిలో దాహార్తి ఎక్కువగా ఉంటుంది. చల్లని నీటిని తాగడానికి రోడు మీదుగా పోయేటప్పుడు ఎక్కడ కుండలు కనిపించినా కొనుక్కుని ఇంటికి తీసుకువెళ్లి కుండ నీటి ఆస్వాదిస్తూ తాగుతుంటారు. దీంతో పేదవాడి ఫ్రిజ్‌గా పిలిచే మట్టి కుండలకు డిమాండ్ బాగా పెరిగింది. పూర్వీకులు అన్ని ఆహార పదార్థాలు మట్టి పాత్రల్లోనే వండుకుని తినేవారు. కాలానుగుణంగా మట్టి పాత్రలు కనుమరుగయ్యాయి. ఇంట్లో ఫ్రిజ్ ఉన్నా కేవలం వేసవిలో మాత్రం చల్లటి మంచినీటి కోసం మట్టి కుండలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

కలిమి బలిమి లేని కుమ్మరి

మట్టి పాత్రల వాడకం తగ్గటంతో వాటిని తయారు చేసే కుమ్మరి వృత్తిదారుల పరిస్థితి దయనీయంగా మారింది. మట్టి పాత్రలను వాడేవారు లేక, చేసిన పాత్రలు అమ్ముడుపోక బతుకు భారంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చల్లపల్లి మండల పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీ శివారు రామానగరంలో సుమారు 30 కుమ్మరి కుటుంబాలు గతంలో ఈ వృత్తినే జీవనంగా సాగించేవారు. ఆదాయం లేకపోవడంతో క్రమంగా వృత్తిని వదిలి వేరే పనులకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఐదు కుటుంబాలు మాత్రమే కుమ్మరి వృత్తిని సాగిస్తున్నామని పేర్కొంటున్నారు. వేసవి సీజన్‌లో మాత్రం మంచినీటి కుండలు అమ్మి కొంత వరకూ బతుకు బండి నెట్టుకొస్తున్నామని వారు దీనగాథ చెబుతున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆరోగ్యం కోసం తిరిగి ప్రజలు క్రమంగా మట్టి పాత్రల వాడకం మొదలుపెట్టారని తమకు పూర్వ వైభవం తిరిగి వస్తుందని ఆశిస్తున్నామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి కుండల అమ్మకాలు బాగున్నాయి



ప్రస్తుతం వేసవి కాలం కావడంతో మట్టి కుండలను ఎక్కువగా కొంటున్నారు. కుండ సైజును బట్టి రూ.150 నుంచి రూ.200 వరకూ విక్రయిస్తున్నాం. రోజుకు 30 నుంచి 40 వరకు కుండల అమ్మకాలు జరుగుతున్నాయి. మున్ముందు ఎండలు మరింత ముదిరి వీటికి డిమాండ్ పెరిగితే రేటు కూడా పెంచే అవకాశం లేకపోలేదు.

– యర్రారపు దుర్గాభవాని, రామానగరం, చల్లపల్లి

మట్టి టిప్పర్ల స్వాధీనం



బంటుమిల్లి: మండల పరిధిలోని మంజులూరు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై అనుమతి లేకుండా మట్టి తోలకాలు చేస్తున్న రెండు టిప్పర్లను మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పూర్ణచంద్రరావు ఆర్‌ఐ శివశంకర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ



గోగినేనిపాలెం(ఘంటసాల): ప్రజల ఆరోగ్యం, భూమి బాగుండాలంటే ప్రకృతి వ్యవసాయం తోడ్పడుతుందని గోగినేనిపాలెం సర్పంచ్ కుంపటి సుశీల అన్నారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జి బి.రాంబాబు ,రైతులు, కార్యదర్శి, ఉప సర్పంచ్, రైతులు, ఎపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో తక్కువ ఖర్చు.. నికర ఆదాయం



కొత్తపల్లి పొలాల్లో మట్టి నమూనాలు సేకరిస్తున్న ఏడీఏ శ్యామల, ఏవో మురళీకృష్ణ

కొత్తపల్లి(ఘంటసాల): భూసార పరీక్షలతో పోషక ఎరువులు వాడటం ద్వారా సాగు ఖర్చులు తగ్గి నికర ఆదాయాన్ని పొందవచ్చని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల రైతులకు తెలిపారు. ఘంటసాల మండలం కొత్తపల్లిలో ఘంటసాల వ్యవసాయశాఖ ఆధ్వర్యాన మట్టి నమూనాల సేకరణపై రైతులకు అవగాహన, గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ కొత్తపల్లిలో రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి అవగాహన కల్పించి వీఏఏలకు శిక్షణ నిర్వహించినట్లు చెప్పారు. ఈ ఏడాది ఘంటసాల మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతుల పొలాల నుంచి 1,082 మట్టి నమూనాలను సేకరించామన్నారు. వాటినపి పరీక్షించి ఫలితాలను జూన్ నెల నాటికి అందించి రైతులకు సూచనలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

చల్లపల్లి: పొలంలో మట్టి పరీక్షలు, భూసార పరీక్షలు చేయించుకోవాలనుకున్న రైతులు ఘంటసాలలోని ఆచార్య రంగా కృషి విజ్ఞాన కేంద్రంలో సంప్రదించాలని శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి పేర్కొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మంగళవారం చల్లపల్లిలో పర్యటించారు. మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల ముఖ్య ఉద్దేశం, ఎలుకల సామూహిక నిర్మూలన వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రేవతి, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన దిగుబడి ఉంటేనే ఆదరణ

గూడూరు: సేంద్రియ పద్ధతిలో సాగు చేసుకుని పంట దిగుబడులు నాణ్యత ఉంటేనే ప్రజలు ఆదరిస్తారని ఏపీ సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షరీఫ్ అన్నారు. మల్లవోలు గ్రామంలో సేంద్రియ వ్యవసాయం చేసిన 11 మంది రైతులు పండించిన మినుములు శాంపిల్స్‌ను మంగళవారం సేకరించారు. గుంటూరు లాం ఫాంలోని సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ల్యాబ్‌కు శాంపిల్స్ పంపినట్లు ఆయన తెలిపారు. శాంపిల్స్‌లో ప్రభుత్వ మార్గదర్శకాలు ఉంటే తమ సంస్థ ద్వారా పంట అమ్ముకునేందుకు ధ్రువీకరణ పత్రం అందచేస్తామన్నారు. కార్యక్రమంలో గూడూరు మండల ఏఓ ఆంజనేయకుమార్, ఎఫ్‌పీఓ సీఈఓ పర్ణం మహాలక్ష్మయ్యనాయుడు, వీఏఏలు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చందనోత్సవం



చల్లపల్లిలో చందనోత్సవం



అలరించిన పార్వతీదేవి నృత్యం

చల్లపల్లి: చల్లపల్లి పడమరవీధిలోని శ్రీషిర్డీ సాయి బాబా జ్ఞానమందిరం నుంచి మంగళవారం సాయంత్రం ప్రారంభమైన చందనోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. గూడూరు గురుదత్త క్షేత్రం నుంచి విచ్చేసిన మహాయోగిని మాతాజీ శ్రీవిశుద్ధానంద భారతీ, ఎం.శివరామప్రసాద్, సాయిభక్త బృందం ఆధ్వర్యంలో భక్తిప్రపత్తులో నిర్వహించారు. తొలుత సాయిబాబా పాదుకలను పల్లకీలో ఉంచి సాయినామ కీర్తనలతో ముందుకు సాగారు. ఆ ప్రాంతమంతా సాయి బాబా నామాలతో మార్మోగింది. ఈ సందర్భంగా వివిధ వేషధారణలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. చిన్నారుల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చందనోత్సవం రామానగరంలోని శ్రీహనుమత్ సాయినిలయం వరకు వెళ్లి ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలను కళ్లేపల్లి బలరామ్, మోపిదేవి శ్రీనివాసరావు(వాసుబాబు), రావులపల్లి సాయిరామ్ ప్రసాద్, కొండూరు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

సంక్షిప్త వార్తలు

■ డ్రోన్ సాయంతో ఐదుగురు జూదరుల అరెస్ట్

చల్లపల్లి: మండల పరిధిలోని నిమ్మగడ్డలో పేకాడుతున్న ఐదుగురిని డ్రోన్ సాయంతో గుర్తించి అదుపులోకి తీసుకుని వారినుంచి రూ.1300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చల్లపల్లి ఎస్‌ఐ వీఎస్వీ సుబ్రహ్మణ్యం తెలిపారు. నిమ్మగడ్డ పొలంగట్లపై పేకాడుతున్నారన్న సమాచారం అందుకుని వారిని డ్రోన్ సహాయంతో గుర్తించి దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

■ అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

మోపిదేవి: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన నాలుగు బాధిత కుటుంబాలకు పులిగడ్డ ఐవీఎం సంస్థ ఆధ్వర్యంలో ఒక్కొక్క కుటుంబానికి రూ. 10 వేలు నగదుతో పాటు నిత్యాసర సరుకులు, పట్టా, దుప్పట్లు, దుస్తులు అందజేశారు. మోపిదేవిలోని బాధిత కుటుంబాలకు మండలి వెంకట్రామ్ సాయం అందజేశారు.

■ అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు మోపిదేవికి చెందిన రామకృష్ణ గ్రాండ్, మారుతీరావు ట్రేడర్స్ అధినేత విస్సంశెట్టి మొగలేశ్వరగుప్త ఆధ్వర్యంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సన్నిధి నాగసాయి చేతుల మీదగా కట్టబియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. వరదా భరత్‌రవి కుమార్, విస్సంశెట్టి పెద రాజా తదితరులు పాల్గొన్నారు.

■ పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు ప్రారంభం

బంటుమిల్లి: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఐసీడీఎస్ ఆధ్వర్యాన 15 రోజుల పాటు జరగనున్న పోషణ్ పక్వాడా పక్షోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శైలజ కుమారి, సీడీపీఓ ఎం. సముద్రవేణి, సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, సుమిత్ర, శ్యామల, వీరరాఘవమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు కలసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. 15 రోజులపాటు గ్రామాల్లో బాలింతలకు, గర్భిణులకు, తల్లులకు పోషణ ప్రాముఖ్యతపై కార్యకర్తలు అవగాహన కలిగించాలని ఎంపీడీఓ, సీడీపీఓలు తెలిపారు.

■ ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని నిరసన



చల్లపల్లి: కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడాన్ని నిరసిస్తూ మంగళాపురం దళితవాడకు చెందిన పలువురు మంగళవారం రాత్రి చల్లపల్లి, మచిలీపట్నం ప్రధాన రహదారిపై లక్ష్మీపురం సెంటరు వద్ద ధర్నాకు దిగారు. చల్లపల్లి మండలం మంగళాపురం దళితవాడకు చెందిన 20 ఏళ్ల కైతేపల్లి సతీష్ సోమవారం నుంచి కనిపించడం లేదు. సతీష్.. స్థానికుడు చంద్ర ఆనంద్ విశ్వమోహన్ ఇంట్లో పనిచేస్తున్నారు. సోమవారం నుంచి సతీష్ కనిపించడం లేదని విశ్వమోహన్ చెప్పడంతో సతీష్ సోదరుడు బన్ను చల్లపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి రెండు రోజులు అవుతున్నా కేసు నమోదు చేయకపోవడంపై ఆగ్రహించిన సతీష్ బంధువులు ధర్నాకు దిగారు. దీంతో లక్ష్మీపురం సెంటరు వద్ద కొంతమేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. విషయం తెలుసుకున్న సీఐ సోమేశ్వరరావు, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేస్తామని చెప్పి ధర్నా విరమింపజేశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. సుమారు అరగంటకు పైగా ధర్నా జరగడంతో రోడ్డుకిరువైపులా కొంతమేర ట్రాఫిక్ నిలిచింది.

■ మురుగు తరలింపుపై మహిళల ఆగ్రహం

చల్లపల్లి: మురుగునీటిని తమ నివాస ప్రాంతాల మీదుగా తరలించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని పాగోలు పంచాయతీ పరిధిలోని శ్రీనగర్ కాలనీ మహిళలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. చల్లపల్లి పంచాయతీ పరిధిలోని కోమల నగర్ అపార్టుమెంట్లకు చెందిన మురుగు నీటిని తమ ప్రాంతంలోని మంచినీటి కాలువలోకి అనుసంధానం చేయటమేంటని ప్రశ్నించారు. కోమలానగర్ కాలనీ, అక్కడున్న అపార్టుమెంట్ల నుంచి వచ్చే మురుగునీటిని గతంలో ఆయా ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీలకు అనుసంధానం చేసుకుని చిల్లలవాగు మురుగు కాలువలోకి తరలించుకోవాలన్నారు. తమ ఇళ్ల మధ్యలో ఉన్న మంచినీటి కాలువలోకి తరలిస్తే ఉద్యమిస్తామని మహిళలు చల్లపల్లి అధికారులను హెచ్చరిస్తున్నారు.

■ జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతం

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో జేఈఈ మెయిన్స్ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం సెషన్‌లో పరీక్ష జరగలేదు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 66 మందికి 60 మంది హాజరయ్యారు. ఆరుగురు ఆబ్సెంట్ అయ్యారని ప్రిన్సిపాల్ బీఆర్‌ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని వారు పేర్కొన్నారు.

స్కూళ్లు, కళాశాలల వద్ద పరిస్థితులను పరిశీలించండి



మహిళా సంరక్షణ కార్యదర్శులతో మాట్లాడుతున్న పెడన ఎస్‌ఐ సత్యనారాయణ

పెడన: మండలంలోని పాఠశాలలు, కళాశాలల వద్ద పరిస్థితులను పరిశీలిస్తుండాలని పెడన ఎస్‌ఐ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు (ఎంఎస్‌కేలు.. మహిళా పోలీసులు)తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పాఠశాలల వద్ద ఉచితంగా చాకెట్లు ఇస్తున్న సందర్భాలు ఉన్నాయోమోనని పరిశీలించాలని ఆదేశించారు. డ్వాక్రా గ్రూపు మహిళలతో నిత్యం సమావేశాలు నిర్వహిస్తూ వారి పిల్లల మనస్తత్వాలు, నడవడికలో ఏమైనా మార్పులు వస్తున్నాయో అడిగి తెలుసుకోవాలని, వీటిని గోప్యంగా ఉంచుతారని తెలిపారు. మన లక్ష్యం కేవలం గంజాయి విక్రయించే వారిపైనేనన్న విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసి అవగాహన కల్పించాలని సూచించారు.

ఎలుకల నివారణను రైతులు తెలుసుకోవాలి



రావివారిపాలెం గ్రంథాలయం వద్ద ఎలుకల మందు తయారుచేస్తున్న విద్యార్థులు

రావివారిపాలెం(మోపిదేవి): విషపు ఎరను ఉపయోగించి ఎలుకలను నివారించడం రైతులు తెలుసుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ ఆర్గనైజర్ డాక్టర్ ఎం.సంధ్య, ప్రిన్సిపల్ రిప్రెసెంటేటివ్ డాక్టర్ అపర్ణ వివరించారు. రావివారిపాలెం గ్రంథాలయం వద్ద జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ బాపట్ల కళాశాల విద్యార్థులు కేవీకే ఘంటసాల ఆధ్వర్యాన సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రోమోడయోలిన్, నూకలు, నూనె ఉపయోగించి విషపు ఎరను తయారు చేయడంపై అవగాహన కల్పించారు. పలువురు రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాటసారుల దాహార్తి తీర్చడం ఎంతో పుణ్యం



కృత్తివెన్ను: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడం ఎంతో పుణ్యమని కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. మంగళవారం సీతనపల్లి ఎంఆర్వో కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జగనన్న ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అనంతరం సంగమూడి పాఠశాలలోని విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృత్తివెన్ను పీహెచ్‌సీ వైద్యులు సాయిసందీప్, మిథున, ఎంఈవో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పెడన కౌన్సిలర్ కటకం ప్రసాద్



పెడనలో బ్యాంకు అధికారుల చుట్టు లబ్ధిదారులు

పెడన: బ్యాంకర్లు అందించే సబ్సిడీ రుణాల విషయంలో దళారుల మాటలను నమ్మి మోసపోవద్దని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో బీసీ, ఓసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలను అందించే వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు హాజరైన వారిని ఉద్దేశించి కటకం ప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకు అధికారులు నిబంధనల ప్రకారం గ్యారంటీతో పాటు తిరిగి రుణాలు చెల్లించే అవకాశాలను పరిశీలించి మున్సిపల్ అధికారులను సంప్రదించి రుణాలు మంజూరు చేస్తారన్నారు. మున్సిపల్ కమిషనర్ గోపాలరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఆయా బ్యాంకుల ద్వారా బీసీ, ఓసీ కార్పొరేషన్లకు సంబంధించి 64 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. వీటిని అర్హులైన వారికి అందించడానికి దరఖాస్తులను స్వీకరించగా 373 వచ్చాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎం.రాజా, వివిధ బ్యాంకులకు చెందిన అధికారులు, ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఒక్కసారిగా బ్యాంకు అధికారులను లబ్ధిదారులు చుట్టుముట్టడంతో మున్సిపల్ కార్యాలయం కిక్కిరిసింది. గందరగోళ పరిస్థితులను మున్సిపల్ సిబ్బంది చక్కదిద్ది ఇంటర్వ్యూలు మధ్యాహ్నానికి పూర్తి చేశారు.

కృత్తివెన్ను: మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఇంటర్వ్యూలు జరిగాయి. మండల వ్యాప్తంగా 93 యూనిట్లుకు 1089 ఆన్‌లైన్ దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీరిలో 600 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. బీసీ కార్పొరేషన్‌కు 63 యూనిట్లుకు 547 దరఖాస్తులు, కాపు కార్పొరేషన్‌కు 25 యూనిట్లకు 524 , కమ్మ కార్పొరేషన్‌కు 3 యూనిట్లకు 18, వైశ్య, బ్రాహ్మణ, ఈబీసీలకు 37 దరఖాస్తులు వచ్చినట్లు వారు పేర్కొన్నారు. కనీసం 100 యూనిట్లు కూడా లేని రుణాలకు వెయ్యి పైచిలుకు దరఖాస్తులు రావడంతో గ్రామానికి కనీసం మూడు యూనిట్లు కూడా రావని దరఖాస్తు పెట్టు కోవడానికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలకు పైగా ఖర్చు చేశామని దరఖాస్తుదారులు పెదవి విరుస్తున్నారు.

కోడూరు: స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ఎంపీడీఓ సుధాప్రవీణ్ పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు జరిగాయి. మాచవరం, పిట్టల్లంక, విశ్వనాథపల్లి, పోటుమీద, రామకృష్ణాపురం, ఉల్లిపాలెం, వి.కొత్తపాలెం పంచాయతీల పరిధిలోని అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మండలంలోని 13 పంచాయతీలకు సంబంధించి 422మంది అభ్యర్థులు సబ్సిడీ రుణాలకు సంబంధించిన ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ ఇంద్రాణి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: పలు సంక్షేమ శాఖల ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు నగరపాలక సంస్థ పరిధిలోని బుట్టాయిపేట టౌన్ హాల్‌లో మంగళవారం రెండో రోజు కూడా రుణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. రెండో రోజు ఇంటర్వ్యూలకు 2024 మంది హాజరుకావాల్సిండగా 1474 మంది మాత్రమే హాజరయ్యారు. 7వ తేదీ జరిగిన ఇంటర్వ్యూలకు 1958 మంది దరఖాస్తుదారులకు 1484 మంది హాజరై 474 మంది గైర్హాజరయ్యారు. నగరంలో బీసీ, ఓసీ, ఈడబ్ల్యూస్ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు మొత్తం 3,982 మంది దరఖాస్తు చేసుకోగా 2,958 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. పలు బ్యాంక్‌ల అధికారులు హాజరై దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేశారు. కార్యక్రమాన్ని నగర కమిషనర్ బాపిరాజు, మెప్మా సీఎంఎం ఆనందబాబు, గుమాస్తాలు కేఎస్ ప్రసాద్, సాయి పర్యవేక్షించారు.

■ ముమ్మరంగా భూముల రీసర్వే

పెడన: పుల్లపాడు పంచాయతీ పరిధిలోని దిరిశవల్లి, కొప్పల్లి పంచాయతీ ముచ్చలిగుంట గ్రామాల్లో భూ రీ సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. దిరిశవల్లి గ్రామంలో 390 ఎకరాలకు ఇప్పటికే 125 ఎకరాలను పూర్తి చేసినట్లు మండల సర్వేయర్ ప్రభు తెలిపారు. ముచ్చలిగుంటలో 372 ఎకరాలకు 110 ఎకరాలు పూర్తి చేశామని, గ్రామస్తులు సహాయ సహకారాలను అందిస్తున్నారని పేర్కొన్నారు.